క్లుప్తంగా

మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీ



శాయంపేట : మండలంలోని కొత్తగట్టు సింగారం గ్రామంలోని మిషన్ భగీరథ పైపులైన్‌కు లీకేజీ ఏర్పడి తాగునీరు పంట పొలాల్లోకి వృథాగా పోతోంది. తాము తాగునీటి కోసం ఇబ్బంది పడుతుండగా పైపులైన్ లీకేజీ వల్ల నీరు వృథాపోతున్నా అధికారులు పట్టించుకోవం లేదంటూ గ్రామస్తులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పైపులైన్ లీకేజీకి మరమ్మతు చేయించి తాగునీటి వృథాను అరికట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

ధర్మసాగర్ : మండలంలోని దేవునూర్ గ్రామంలో పేకాడుతున్న ఆరుగురిని అరెస్ట్ చేసినట్టు పోలీసులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. గ్రామానికి చెందిన మోరే మహేందర్, సంగేకారి లక్ష్మయ్య, హింగే అనిల్, మోహన్‌రావు, కైరిక చందర్, హింగే రాజేందర్ గ్రామంలోని ఓ ఇంట్లో పేకాడుతున్నట్టు పక్కా సమాచారం అందడంతో పోలీసులు దాడి చేసి రూ.950 నగదుతోపాటు 4 సెల్‌ఫోన్లు, పేక ముక్కలు సీజ్ చేసినట్టు పేర్కొన్నారు. కేసు నమోదు చేశామని వివరించారు.

యువకుడిపై కేసు

ధర్మసాగర్ : మండలంలోని ఎల్కుర్తి గ్రామానికి చెందిన యువతిని ప్రేమ పేరుతో వేధించగా మెడి నిఖిల్‌పై కేసు నమోదు చేసినట్టు పోలీసులు ఓ ప్రకటనలో తెలిపారు. యువతి ఫిర్యాదు మేరకు విచారణ చేస్తున్నట్టు పేర్కొన్నారు.

ఆర్థిక మోసంపై..

దామెర : ఆర్థిక మోసానికి పాల్పడ్డ వ్యక్తిపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై అనిల్‌కుమార్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మండలంలోని పసరగొండ గ్రామానికి చెందిన ఆకుల సాంబయ్య అతడి 41 మేకలను కరీంనగర్ జిల్లా గంగాధర మండలంలోని లక్ష్మీదేవిపేటకు చెందిన తొంటి రాజు, జక్కుల జానయ్య, జె.నర్సయ్యలకు రూ.3.48 లక్షలకు గతేడాది సెప్టెంబర్ 1న విక్రయించాడు. కాగా సాంబయ్యకు రాజు, జానయ్య, నర్సయ్య అడ్వాన్స్‌గా రూ.51 వేలు చెల్లించి మిగతా డబ్బులు అదే ఏడాది సెప్టెంబర్ 10న చెల్లిస్తామని ఒప్పందం చేసుకున్నారు. రాజు, జానయ్య, నర్సయ్య మిగతా రూ.2.97 లక్షలు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతుండడంతో సాంబయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ క్రమంలో కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

భూఆక్రమణపై..

దామెర : భూఆక్రమణపై కేసు నమోదైన ఘటన మండలంలోని ఓగ్లాపూర్‌లో శనివారం చోటు చేసుకుంది. ఎస్సై అనిల్ కుమార్ మీడియాకు వివరాలు వెల్లడించారు. ఓగ్లాపూర్ సమీపంలోని సర్వే నంబర్ 109, 110లోని తన భూమిలో కొట్టిపాక రవి, అంబి సాంబయ్య, కన్నె నర్సయ్య, కొయ్యడ మనోహర్ అక్రమంగా చొరబడ్డారని హనుమకొండకు చెందిన శ్రీరామోజు సుధీర్ కుమార్ ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్సై తెలిపారు.

కాపర్ వైర్ చోరీ

ఎల్కతుర్తి : మండలంలోని వల్బాపూర్ గ్రామ శివారులోని ఎస్సారెస్పీ కాలువ సమీపంలోని 25 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లోని కాపర్ వైర్‌ను గుర్తు తెలియని దుండగులు శుక్రవారం రాత్రి చోరీ చేశారు. ఈ మేరకు ఏఈ లక్ష్మణ్ నాయక్ ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్టు ఎస్సై పరమేష్ విలేకరులకు శనివారం తెలిపారు. చోరీకి గురైన వైరు విలువ సుమారు రూ.20 వేలు ఉంటుందని పేర్కొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

శాయంపేట : క్రీడలతోనే మానసికోల్లాసం కలుగుతుందని ఎంపీడీఓ ఆమంచ కృష్ణమూర్తి తెలిపారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర హైస్కూల్‌లోని క్రీడా మైదానంలో పెయింటర్ గాజుల మొగిలి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన వాలీబాల్ టోర్నమెంట్‌ను ఎంపీడీఓ కృష్ణమూర్తి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించి మాట్లాడారు.

స్థానికత కోల్పోతున్న వారికి న్యాయం చేయాలి

నడికూడ : జీఓ నెంబర్ 317 వల్ల స్థానికత కోల్పోతున్న ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని టీబీటీఎస్ఎస్ జిల్లా అధ్యక్షుడు రాజన్ జాదవ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. త్వరలో బదిలీలు చేపట్టనున్న క్రమంలో బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు.

బాధిత కుటుంబానికి బియ్యం అందజేత

ఎల్కతుర్తి : మండలంలోని వీరనారాయణపూర్ గ్రామానికి చెందిన బీజేవైఎం నాయకుడు మండ వరప్రసాద్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా బాధిత కుటుంబానికి మాజీ హౌజ్ ఫెడ్ చైర్మన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి శనివారం 50 కేజీల బియ్యం అందించారు. తొలుత వరప్రసాద్ కుటుంబాన్ని పరామర్శించి సానుభూతి వ్యక్తం చేశారు. శ్రీరామ్ చక్రవర్తి వెంట నాయకులు మధుకర్‌గౌడ్, శ్రావణ్‌రెడ్డి, వెంకటరమణ, పెరుకు మధు, శ్రీకాంత్, వెంకటేష్ తదితరులున్నారు.

పీహెచ్‌సీలో ఆహ్లాదం.. ఆరోగ్యం

- పచ్చదనంతో పరిఢవిల్లుతున్న గోపాల్‌పూర్ పీహెచ్‌సీ



ఎల్కతుర్తి : ఆస్పత్రి అనగానే అయోడిన్, మందుల వాసన పరిపాటి. ఇక ప్రభుత్వ ఆస్పత్రి అంటే 'నేను రాను బిడ్డో సర్కారు దవాఖానకు..' అన్న పాట గుర్తు చేసేలా ఉంటోందన్న అపవాదు ఉండనే ఉంది. ఇలాంటి పరిస్థితిలో మండలంలోని గోపాల్‌పూర్ గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆహ్లాదం.. ఆరోగ్యం కలగలిసిన వైద్యశాలగా ప్రజల హృదయాన్ని దోచుకుంటోంది. ఆస్పత్రి ఆవరణలో పచ్చదనం పరిఢవిల్లుతోందంటే ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదు. ఆస్పత్రిలో ఎటు చూసినా పచ్చని చెట్లే కనిపిస్తాయి. ఆస్పత్రి చుట్టూ పచ్చని చెట్లు, అందమైన మొక్కలతో అలంకరించడం ఆకర్షణీయంగా ఉంది. రోగాలతో బాధపడుతూ ఆస్పత్రికి వచ్చే రోగులు వైద్యశాలలోకి రాగానే మానసిక స్వాంతన పొందుతారు. ఇక సగం రోగం నయమైనట్టే అన్న అభిప్రాయమూ వారి మనసుల్లో నాటుకుపోతోంది.

ఆహ్లాదమైన వాతావరణం

గోపాల్‌పూర్‌లో ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని 2000 సంవత్సరంలో నిర్మించారు. అప్పటి నుంచి రోగులకు వివిధ రకాల సేవలను అందిస్తున్నారు. పలు గ్రామాల నుంచి దూరభారానికి ఓర్చి వస్తున్న రోగులకు ఆస్పత్రి రకరకాల చెట్లతో తోటను తలపిస్తోంది. పార్కులోకి వెళ్లిన అనుభూతి కలుగుతోంది. ఆస్పత్రి చుట్టూ పలు రకాల చెట్లు, మొక్కలతో ఎంతో ఆహ్లాదాన్ని పంచుతోంది.

ఎన్ని రకాల చెట్లంటే

ఆస్పత్రి చుట్టూ రకరకాల చెట్లు, అందమైన మొక్కలు ఏర్పాటు చేశారు. విరబూగబూసిన పూల గుభాళింపు మధ్య ఆస్పత్రి తోటను తలపిస్తోంది. ఆస్పత్రి ఆవరణలో ప్రస్తుతం 36 మామిడి, 40 టేకు, 5 సపోట, 3 వేప చెట్లతోపాటు నిమ్మ, జామ చెట్లతోపాటు వివిధ రకాల పూల మొక్కలు నాటారు. వీటికి తోడు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన హరితహారంతో మరింత శోభ సంతరించుకుంది. ఆస్పత్రి ఆవరణలో మరిన్ని మొక్కలు చేరి అందాన్ని, ఆహ్లాదాన్ని మరింత పెంచాయి.

అభివృద్ధి నిధులు సద్వినియోగం

ఏటా ఆస్పత్రి అభివృద్ధి కోసం వచ్చే నిధులను సిబ్బంది సద్వినియోగం చేస్తున్నట్టు కనపడుతోంది. కమిటీ తీర్మాణాల మేరకు నిధులు ఖర్చు చేస్తూ గార్డెన్‌ను కాపాడుకుంటున్నారు. వైద్యశాల పర్యావరణానికి పాదు వేయడంతోపాటు రోగులకు మానసిక ప్రశాంతత కల్పిస్తూ ఇతర ప్రభుత్వ ఆస్పత్రులకు ఆదర్శంగా నిలుస్తోంది.

సిబ్బంది సహాయ సహకారాలు భేష్



చెట్లను సంరక్షించేందుకు ఆస్పత్రి సిబ్బంది మనస్ఫూర్తిగా సహకరిస్తున్నారు. నిత్యం మొక్కల, చెట్ల ఆలనాపాలన చూస్తున్నారు. తద్వారా ఆస్పత్రికి వచ్చే ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధుల అభినందనలు అందుకుంటున్నారు. ఇతర ప్రభుత్వ ఆస్పత్రులకు దీటుగా పచ్చదనానికి కేరాఫ్‌గా నిలుస్తుండడం ఆనందం కలిగిస్తోంది.

-డాక్టర్ శోభారాణి, వైద్యాధికారి

మార్నేనికి ఎంపీ దయాకర్ పరామర్శ



ఐనవోలు : మార్నేని రవీందర్‌రావును పరామర్శిస్తున్న ఎంపీ దయాకర్

ఐనవోలు : డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్ రావును మండల కేంద్రంలోని నివాసంలో వరంగల్ ఎంపీ పసునూరి దయాకర్ శనివారం పరామర్శించారు. రవీందర్‌రావు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ప్రమాదం జరిగిన తీరు అడిగి తెలుసుకున్నారు. బీఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా నియోజకవర్గ ఇన్‌చార్జ్ అరూరి విశాల్ మండల యూత్ నాయకులతో కలిసి రవీందర్‌రావును పరామర్శించారు. అలాగే వనమాల కనపర్తి, ఇల్లంద, వర్ధన్నపేటలకు చెందిన పలువురు నాయకులు రవీందర్‌రావును వేర్వేరుగా కలిసి పరామర్శించారు.

కమలాపూర్ : మండల కేంద్రానికి చెందిన బైరి రాము, భాషబత్తిని అరవింద్ ప్రీ వెడ్డింగ్ ఫొటో షూట్ కోసం వెళ్లి రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా వారి కుటుంబాలను గ్రేటర్ ఫొటో, వీడియోగ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు రంగు సదానందం, ప్రధాన కార్యదర్శి బిల్లా రమేష్, కోశాధికారి పాటి రాజు, కట్ల రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి పెరుమాండ్ల దయాకర్, ఉపాధ్యక్షులు వాసుదేవరావు, జ్యోతి రమేష్, కందికొండ శ్యామ్ తదితరులు పరామర్శించారు. తొలుత రాము, అరవింద్ మృతదేహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

విద్యార్థుల అభివృద్ధిలో పేరెంట్స్ కీలకం



మాట్లాడుతున్న హెచ్‌ఎం లింగారావు

ఐనవోలు : విద్యార్థుల అభివృద్ధిలో తల్లిదండ్రులు కీలకమని ఉడుతగూడెం హైస్కూల్ హెచ్‌ఎం చుంచుకాల లింగారావు తెలిపారు. మండలంలోని ఉడుతగూడెం గ్రామంలోని ప్రభుత్వ హైస్కూల్‌లో శనివారం నిర్వహించిన పేరెంట్స్–టీచర్స్ మీట్‌లో లింగారావు మాట్లాడారు. పాఠశాలలో అమలవుతున్న తొలిమెట్టు కార్యక్రమం గురించి పేరెంట్స్‌కు వివరించారు. ఎఫ్ఏ–3లో వచ్చిన మార్కులు, గ్రేడులు తెలిపారు. పాఠశాలకు విడుదలైన నిధులు కిటీకీలు, ఆట వస్తువులు, మోటర్ రిపేర్, ఇతరత్రా ఖర్చులకు వినియోగించేలా తీర్మానం చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో టీచర్ ప్రతికంఠం ఉమాదేవి, తల్లిదండ్రులు ఇల్లందుల రాజు, చిదురాల మమత, ఆకులపల్లి రవి పాల్గొన్నారు.

రానున్న ఎన్నికల్లో గెలుపే లక్ష్యం



మాట్లాడుతున్న మొలుగూరి భిక్షపతి

పరకాల : రానున్న ఎన్నికల్లో బీజేపీ గెలుపే లక్ష్యంగా గ్రామాల్లో కార్యక్రమాలు చేపడుతున్నట్టు ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు, మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి, నియోజకవర్గ ఇన్‌చార్జ్ పెసరు విజయ్‌చందర్‌రెడ్డి, హుస్నాబాద్ అసెంబ్లీ పాలక్ డాక్టర్ సిరంగి సంతోష్‌కుమార్ తెలిపారు. పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయంలో పట్టణ కమిటీ అధ్యక్షుడు మార్త భిక్షపతి అధ్యక్షతన శనివారం నిర్వహించిన సమావేశానికి ముఖ్యఅతిథులుగా మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి, విజయ్‌చందర్‌రెడ్డి, సంతోష్‌కుమార్ హాజరై మాట్లాడారు. ఈనెల 23న మండలంలో హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ పర్యటిస్తారని తెలిపారు. పరకాల, నడికూడ మండలాల్లోని పలు గ్రామాల్లో పార్టీ కార్యాలయాలను ప్రారంభిస్తారని, పార్టీ జెండాలను ఆవిష్కరిస్తారని తెలిపారు. లలిత కన్వెన్షన్ హాల్‌లో తలపెట్టిన కార్యక్రమంలో ఈటల సమక్షంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల నుంచి పలువురు బీజేపీలో చేరుతారని చెప్పారు. సమావేశంలో ఆ పార్టీ బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యుడు రాజవీరు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గురుప్రసాద్, నాయకులు మేఘనాథ్, జిల్లా కార్యదర్శి రామన్న తదితరులు పాల్గొన్నారు.

మండలంలో పామాయిల్ సాగుకు శ్రీకారం



ప్రగతి సింగారానికి చేరిన పామాయిల్ మొక్కలు చూపిస్తున్న ఎంపీపీ తిరుపతిరెడ్డి

శాయంపేట: మండలంలోని ప్రగతి సింగారం గ్రామానికి చెందిన ఎంపీపీ మెతుకు తిరుపతిరెడ్డి మండలంలో తొలిసారిగా పామాయిల్ సాగు చేపట్టారు. భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి సహకారంతో తనుకున్న 10 ఎకరాల్లో 570 పామాయిల్ మొక్కలను శనివారం కూలీలతో నాటించాడు. పామాయిల్ సాగు వల్ల కలిగే లాభాలపై ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ జ్యోతి రైతులను ఇటీవల ఖమ్మం జిల్లా అశ్వరావుపేట మండలంలోని దమ్ముగూడెం గ్రామానికి క్షేత్రస్థాయి పరిశీలనకు తీసుకెళ్లి అవగాహన కల్పించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే ఎంపీపీ తిరుపతిరెడ్డి సాగుకు నడుం బిగించారు.

వీరభద్రస్వామి జాతర ఆదాయం రూ.40.53 లక్షలు

భీమదేవరపల్లి : మండలంలోని కొత్తకొండ వీరభద్రస్వామి ఆలయ జాతర ఆదాయం రూ.40,53,918 వచ్చినట్టు ఆలయ కమిటీ చైర్మన్ మాడిశెట్టి కుమారస్వామి, ఈఓ కిషన్‌రావు తెలిపారు. వేలం ద్వారా రూ.17లక్షలు సమకూరగా ఈనెల 14, 15, 16, 17, 18 తేదీల్లో ప్రత్యేక దర్శనాలు, అభిషేకాలు, ప్రభలు, కోడెను కట్టుట తదితరాల ద్వారా రూ.23,53,918లు ఆదాయం వచ్చినట్టు వివరించారు. గతేడాదితో పోల్చితే ఈసారి రూ10.84 లక్షలు అదనపు ఆదాయం వచ్చినట్టు తెలిపారు. కాగా ఈనెల 30న హుండీ ఆదాయాన్ని లెక్కించనున్నట్లు చెప్పారు.

లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



కుల సంఘ భవన నిర్మాణాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డి

కమలాపూర్ : మండల కేంద్రంలోని కమ్యూనిటీ హాలులో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 18 మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. తొలుత ఈనెల 31న రాష్ట్ర మంత్రి కేటీఆర్ మండలంలో పర్యటించనున్న సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులు, ముఖ్యనాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. అనంతరం మండల కేంద్రంలో నిర్మిస్తున్న అయ్యప్ప స్వామి ఆలయాన్ని, కుల సంఘ భవన నిర్మాణాలను పరిశీలించారు. కార్యక్రమాల్లో పీఏసీఎస్ చైర్మన్ పేరాల సంపత్‌రావు, వైస్ చైర్మన్ ఎర్రం ఇంద్రసేనారెడ్డి, డైరెక్టర్ తక్కళ్లపెల్లి సత్యనారాయణరావు, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు పెండ్యాల రవీందర్ రెడ్డి, రైతు సంఘం మండల కన్వీనర్ ఇమ్మడిశెట్టి శ్రీనివాస్, నాయకులు పింగిలి ప్రదీప్‌రెడ్డి, లాండిగె లక్ష్మణ్‌రావు, తడక శ్రీకాంత్, మౌటం అశోక్, కట్కూరి తిరుపతిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

'గోపి శర్మ రాజీనామా చేయాలి'

భీమదేవరపల్లి : మండలంలోని మాణిక్యాపూర్ గ్రామానికి చెందిన ఎంపీటీసీ మామిండ్లపల్లి గోపి శర్మ తన పదవికి రాజీనామా చేయాలని కాంగ్రెస్ నాయకులు ముద్దసాని సదానందం, అనపురం శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. గోపి శర్మ కాంగ్రెస్ బీఫాంతో ఎంపీటీసీగా గెలిచి తదనంతరం ఇటీవల బీజేపీలో చేరడం దుర్మార్గమన్నారు. గోపి శర్మ కాంగ్రెస్ పార్టీకి ద్రోహం చేశాడని మండిపడ్డారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు అయిలబోయిన సాంబయ్య, గడ్డం కనకయ్య, పిల్లి సంపత్, ఎదులాపరం సాంబయ్య, ఎనుగుల సమ్మయ్య, తూముల ఎల్లయ్య, తాళ్లపల్లి రమేష్, ఆడెపు అయిలయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రతిభ అభినందనీయం

- జెడ్పీ చైర్మన్ మారపెల్లి సుధీర్‌కుమార్



విద్యార్థులకు పతకాలు అందజేస్తున్న జెడ్పీ చైర్మన్ సుధీర్‌కుమార్

భీమదేవరపల్లి : మండలంలోని కొత్తకొండ గ్రామంలోని ప్రభుత్వ హైస్కూల్ విద్యార్థులు జాతీయ స్థాయిలో ప్రతిభ చాటడం అభినందనీయమని జెడ్పీ చైర్మన్ డాక్టర్ మారెపల్లి సుధీర్‌కుమార్ తెలిపారు. ఆ గ్రామంలోని పాఠశాల ఆవరణలో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన విద్యార్థులకు బంగారు, వెండి పతకాలు అందించి మాట్లాడారు. ఇటీవల ముంబాయిలో జాతీయ స్థాయిలో నిర్వహించిన రంగోత్సవ్ డ్రాయింగ్ పోటీల్లో ఎంట్రీలు పంపిన 29 మంది విద్యార్థులు ప్రతిభ చాటి బంగారు, వెండి పతకాలు కైవసం చేసుకున్నట్టు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతూ వివిధ రంగాల్లో విద్యార్థులు జాతీయ స్థాయిలో రాణించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. డ్రాయింగ్ టీచర్ శ్రీకాంత్‌కు కళావిభూషణ్, క్రాఫ్ట్ టీచర్ మల్లేశంకు ఎక్సలెన్స్ అవార్డు, హెచ్‌ఎం సునీతరాణికి కృతిశీల్ ప్రధ్యాపక్ పురస్కారం అందడం అభినందనీయమని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ జక్కుల అనిత, జెడ్పీటీసీ వంగ రవి, హెచ్‌ఎం సునీతరాణి, కొత్తకొండ వీరభద్రస్వామి ఆలయ కమిటీ చైర్మన్ మాడిశెట్టి కుమారస్వామి, సర్పంచ్ దూడల ప్రమీల, ఎంపీటీసీ యాటపోలు రాజమణి, ఉపసర్పంచ్ కృష్ణ, ఎంఎస్‌సీ శారద తదితరులు పాల్గొన్నారు.

రోడ్ల నిర్మాణంలో ప్రభుత్వ నిర్లక్ష్యం



ధర్నా చేస్తున్న బీజేపీ నాయకులు, కార్యకర్తలు

ధర్మసాగర్ : మండలంలో దెబ్బతిన్న రోడ్లను నిర్మించడంలో, మరమ్మతులు చేయించడంలో రాష్ట్ర ప్రభుత్వ, అధికారుల నిర్లక్ష్యం ఉందని మాజీ మంత్రి, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండె విజయ రామారావు తెలిపారు. మండల కేంద్రం నుంచి సాయిపేటకు వెళ్లే ప్రధాన రహదారిపై ఆ పార్టీ మండల అధ్యక్షుడు గంకిడి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ధర్నాకు విజయరామారావు హాజరై మాట్లాడారు. మండలంలోని ప్రధాన రహదారులన్నీ దెబ్బతిన్నాయని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం రోడ్ల నిర్మాణాలకు నిధులు మంజూరు చేసిందని తెలిపారు. మండలంలోని రోడ్ల నిర్మాణం, మరమ్మతులు చేపట్టడంలో ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య, ఎమ్మెల్సీలు కడియం శ్రీహరి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. సమావేశంలో ఆ పార్టీ నాయకులు చిలుక విజయరావు, బొజ్జపెల్లి సుభాష్, గాజుల సంపత్ కుమార్, బోడపట్ల కుమార్, దుస్సా రాములు, మజ్జిగ లింగం, చట్ల రాజు, కొలిపాక లవన్, పూల శ్రీనివాస్, వక్కల భరత్‌కుమార్, కన్నబోయిన శ్రీధర్, ధర్మేందర్, పాడిశెట్టి రంజిత్, వెంకటేష్, రఘువీర్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ సభతో బీజేపీ నేతల్లో భయం

- ఆగ్రోస్ మాజీ చైర్మన్ లింగంపల్లి కిషన్‌రావు

పరకాల: ఖమ్మంలో జరిగిన బీఆర్ఎస్ బహిరంగ సభను చూసిన తర్వాత బీజేపీ నాయకుల్లో ఆందోళన మొదలైందని ఆగ్రోస్ మాజీ చైర్మన్ లింగంపల్లి కిషన్‌రావు అన్నారు. పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డిపై వ్యక్తిగత విమర్శలు మానుకోవాలని బీజేపీ నాయకులకు సూచించారు. శనివారం పరకాల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశ ప్రజల సంక్షేమం కోసం ఆవిర్భవించిన బీఆర్ఎస్ వచ్చే ఎన్నికల్లో సత్తా చాటడం ఖాయమన్నారు. ఒకే వేదికపైకి ఐదుగురు సీఎంలను తీసుకొచ్చి దేశంలో ఎక్కడా జరగని విధంగా సభ నిర్వహించడంతో బీజేపీలో భయం మొదలైందన్నారు. ఖమ్మం సభ సాక్షిగా కేసీఆర్ ఇచ్చిన మాటలకు కట్టుబడి ఉంటారన్నారు. సమావేశంలో దళితబంధు కమిటీ చైర్మన్ సోదా రామకృష్ణ, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు మడికొండ శ్రీను, మున్సిపల్ వైస్ చైర్మన్ విజయపాల్‌రెడ్డి, కౌన్సిలర్లు సంపత్‌కుమార్, అడప రాము, సంతోష్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ రాజేందర్ రెడ్డి, నాయకులు సాయితిరుపతిరెడ్డి, మార్క రఘుపతి, నవీన్, సదానందం, కళావతి పాల్గొన్నారు.

'డబుల్' ఇళ్లు దక్కేలా పోరాటాలు

- ఎంసీపీఐ(యూ) జాతీయ కార్యదర్శి ఎం.అశోక్

పరకాల : నిరుపేద గుడిసెవాసులందరికీ డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు దక్కేలా పోరాటాలు నిర్మిస్తామని ఎంసీపీఐ(యూ) జాతీయ కార్యదర్శి మద్దికాయల అశోక్ తెలిపారు. పట్టణంలో ఆ పార్టీ ప్లీనరీ సమావేశాలు శనివారం ముగిశాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్యఅతిథిగా అశోక్ హాజరై మాట్లాడారు. దశాబ్దాలుగా గుడిసెలు వేసుకుని నివాసం ఉంటున్న పేదలకు పట్టాలివ్వాలని, ఇండ్లు కట్టించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం ఆ పార్టీ జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. కార్యదర్శిగా ఎస్‌రెడ్డి హంసరెడ్డి, సహాయ కార్యదర్శిగా నీల రవీందర్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో నాయకులు పరికిరాల భూమయ్య, చీపురు ఓదయ్య, సావిత్రి, ఇంద్రారెడ్డి, ఎంఎస్.రావు, బండారు చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

పోరాటాలతోనే ప్రజాసమస్యల పరిష్కారం

ఐనవోలు : ఐక్యపోరాటాలతోనే ప్రజాసమస్యలు పరిష్కారమౌతాయని సీపీఎం మండల కార్యదర్శి కాడబోయిన లింగయ్య తెలిపారు. మండలంలోని వెంకటాపూర్ గ్రామానికి చెందిన 20 మంది కార్మికులు ఆ పార్టీలో చేరగా వారికి లింగయ్య కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా లింగయ్య మాట్లాడారు. ప్రభుత్వ భూములను భూకబ్జాదారుల నుంచి కాపాడి పేదలకు పంచుతున్నామని చెప్పారు. ప్రజాసమస్యల పరిష్కారానికి పోరాడుతున్నట్టు తెలిపారు. గత ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీలను పాలక పార్టీలు అమలు చేయడం లేదని మండిపడ్డారు. సీపీఎంలో చేరిన వారిలో మాదాసి సుధాకర్, సంతోష్‌కుమార్, మేకరి మోహన్‌రావు, మాదాసి సలీం, రాజు, మచ్చ వేణు, బిర్రు శ్రీధర్, మచ్చ జోసెఫ్, మాదాసి ప్రవీణ్, సుజిత్, సింగారపు భరత్, ప్రశాంత్ ఉండగా కార్యక్రమంలో నాయకులు బండి పర్వతాలు, నారాయణరెడ్డి, ఉప్పలయ్య, రాయపురపు కొంరయ్య, కవిత, జక్కుల నర్సయ్య, లెంకల నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహిస్తాం

ధర్మసాగర్ : గ్రామీణ క్రీడాకారులకు చేయూత అందించి ప్రోత్సహిస్తామని మాజీ సర్పంచ్ తోట స్రవంతి, మాజీ ఎంపీటీసీ తోట నాగరాజు తెలిపారు. మండలంలోని పెద్దపెండ్యాల గ్రామంలోని క్రీడాకారులకు క్రికెట్ కిట్, టీషర్ట్స్ కోసం వారు శనివారం రూ.10 వేలు సాయం అందించారు. ఈ సందర్భంగా స్రవంతి, నాగరాజు మాట్లాడారు. మాజీ డిప్యూటీ సీఎం, ఎమ్మెల్సీ కడియం శ్రీహరిని స్ఫూర్తిగా తీసుకుని గ్రామంలోని అన్ని వర్గాల ప్రజలకు సహాయ సహకారాలు అందిస్తున్నట్టు తెలిపారు. క్రీడాకారులకు షటిల్ బ్యాడ్మింటన్ కోసం ఆర్టీసీ డ్రైవర్ మునిగాల రాజేందర్ రూ.4 వేలు సాయం అందించినట్టు తెలిపారు. కార్యక్రమంలో బత్తిని రాజ్‌కుమార్, పుండ్రు ప్రతాప్‌రెడ్డి, జిట్ట కుమార్, నాగరాజు, సాంబరాజు తదితరులు పాల్గొన్నారు.

యూత్ కమిటీ ఎన్నిక

దామెర : మండలంలోని సింగరాజుపల్లి గ్రామంలో యంగ్ డైనమిక్ యూత్ కమిటీని శనివారం ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా వడ్డెపల్లి సురేష్, అధ్యక్షుడిగా బొచ్చు రాకేష్, ప్రధాన కార్యదర్శిగా వడ్డెపల్లి రాజేష్, ఉపాధ్యక్షుడిగా వడ్డెపల్లి నాగరాజు, కోశాధికారిగా మంద నవీన్, క్యాషియర్‌గా వడ్డెపల్లి శ్రీకాంత్, ప్రచార కార్యదర్శిగా సిలుముల సిద్దు, స్పోర్ట్స్ వింగ్ సెక్రెటరీగా వంటేరు శివ, వైస్ కెప్టెన్‌గా కోడెపాక కార్తీక్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు రాకేష్ మాట్లాడారు. యూత్ ఆధ్వర్యంలో సామజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

ఎల్కతుర్తి : తెలంగాణ అంబేద్కర్ సంఘం ముద్రించిన 2023 సంవత్సర క్యాలెండర్‌ను మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఆ సంఘం నాయకులు శనివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జన్ను నర్సయ్య, రాష్ట్ర కమిటీ సభ్యుడు మేకల చేరాలు, ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు తూముల సదానందం, హన్మకొండ జిల్లా అధ్యక్షుడు అంబాల ఆనంద్, మండల అధ్యక్షుడు ఆర్య రాజు, నాయకులు సుమన్, రవి, నరేష్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

చర్యలు తీసుకోవాలి

దామెర : తమ భూమిని ఆక్రమించిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని మండలానికి చెందిన శ్రీరామోజు శిరీష్‌కుమార్, శ్రీరామోజు సుధీర్ కుమార్ ప్రభుత్వాన్ని కోరారు. మండల కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. మండలంలోని ఓగ్లాపూర్‌లోని సర్వే నంబర్ 109, 114ల్లోని తమకు చెందిన 12 ఎకరాల భూమిని సీపీఎం ఆధ్వర్యంలో ఆక్రమించి జెండాలు పాతారని, గుడిసెలు వేశారని తెలిపారు. తమ భూమిలో గుడిసెలు వేయించడం సరికాదన్నారు. ప్రభుత్వం, పోలీసు శాఖ అధికారులు గుడిసెలు వేయించిన వారిపై చర్యలు తీసుకుని తమ భూమికి రక్షణ కల్పించి న్యాయం చేయాలని కోరారు.

'ఆరోపణలు సరికాదు'

దామెర : ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డిపై ఆరోపణలు సరికాదని మండలంలోని పులుకుర్తికి చెందిన రైతులు ఎం.కృష్ణమూర్తి, సమ్మయ్య, డి.రాజు, సుమలత, సూర్యం, కళ, మొగిలి, పేరబోయిన కిరణ్, ఆనందం, సుశీల, మహేష్, అశోక్ అన్నారు. ఆ గ్రామం నుంచి చెన్నకేశవస్వామి గుట్ట వరకు చేపట్టిన రోడ్డు మీదకు శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. గతంలో వ్యవసాయ బావుల వద్దకు వెళ్లాలంటే ఇబ్బంది పడే పరిస్థితి ఉండేదన్నారు. తాము ఇష్టపూర్వకంగానే రోడ్డు నిర్మాణం కోసం భూములు ఇచ్చినట్టు తెలిపారు. సమావేశంలో సర్పంచ్ గోవింద్ అశోక్, ఉపసర్పంచ్ మెంతుల రాజు తదితరులు పాల్గొన్నారు.

అనాథ బాలల బాధ్యత ప్రభుత్వానిదే

ధర్మసాగర్ : అనాథ బాలల బాధ్యత ప్రభుత్వానిదేనని ఎమ్మార్పీఎస్ జాతీయ పొలిట్‌బ్యూరో సభ్యుడు బొడ్డు దయాకర్ తెలిపారు. అనాథ బాలల సంరక్షణ, సంక్షేమంలో ఎదురౌతున్న సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని కోరుతూ ఆయన ఆధ్వర్యంలోని బృందం స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్యను శనివారం కలిసి వినతిపత్రం అందజేసింది. ఈ సందర్భంగా దయాకర్ మాట్లాడారు. అనాథ బాలలకు గుర్తింపు కార్డులిస్తామని, కేజీ నుంచి పీజీ వరకు రెసిడెన్షియల్ గురుకులాల్లో చదివిస్తామని, తదితర అనేక హామీలు గుప్పించిన రాష్ట్ర ప్రభుత్వం తదనంతరం వాటిని విస్మరించిందని విమర్శించారు. నాటి మంత్రివర్గ ఉపసంఘంలో తీసుకున్న నిర్ణయాలను అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ నాయకులు కొయ్యడ మల్లేష్, జాతీయ కార్యదర్శి రాగల్ల ఉపేందర్, గంగారపు శ్రీనివాస్, జేరిపోతుల సుధాకర్, సందెన రవీందర్, సుమన్ తదితరులు పాల్గొన్నారు.